క్లుప్తంగా

మిద్దె పైనుంచి పడిన యువకుడి మృతి

పొదలకూరు : ఇంటి మిద్దెపై నుంచి కింద పడి గాయాలపాలైన పట్టణంలోని ఎమ్మార్వో కాలనీకి చెందిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి బుజ్జయ్య మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై కరిముల్లా కేసు నమోదు చేశారు. ఎస్సై కథనం మేరకు.. ఎమ్మార్వో కాలనీలో నివాసం ఉంటున్న జ్యోతి సుబ్రహ్మణ్యం(28) సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈనెల 24వ తేదీ రాత్రి ఇంటి మిద్దెపై నిద్రపోయాడు. మిద్దెకు పిట్టగోడ లేకపోవడంతో సుబ్రహ్మణ్యం దొర్లి కింద పడిపోయాడు. ఈ క్రమంలో తలకు గాయమవడంతో కుటుంబసభ్యులు ముందుగా పొదలకూరు సీహెచ్‌సీలో చికిత్స చేయించి నెల్లూరు జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడి నుంచి తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. ఈ మేరకు ఎస్సై దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటార్ బైక్ అదుపుతప్పి పడడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి సమీపంలో మంగళవారం జరిగింది. నెల్లూరు నగరానికి చెందిన రవితేజ పనినిమిత్తం బైక్‌పై సర్వేపల్లికి వస్తుండగా గొలగమూడి సమీపంలో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో రవితేజకు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

కోవూరు : సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరమని ఇనమడుగు పీహెచ్‌సీ యూనిట్ ఆఫీసర్ నాగరాజు తెలిపారు. మండలంలోని కోవూరు గ్రామ సచివాలయం-2 పరిధిలో మలేరియా నివారణ వారోత్సవాల్లో భాగంగా పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సీజన్‌లో దోమలను నివారించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు మలేరియా వ్యాప్తి, నివారణ, దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది ఇలియాజ్, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

కొడవలూరు: మండలంలోని రామాపురం ప్రాథమికోన్నత పాఠశాల, ఉర్దూ పాఠశాల విద్యార్థులకు బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన సహారా ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు షేక్.యస్దానిబాషా మాట్లాడుతూ ప్రతి ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు సొసైటీ ద్వారా విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్నామన్నారు. సేవా కార్యక్రమానికి సహకారం అందించిన తాళ్ల స్వామికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అనసూయమ్మ, ఉర్దూ పాఠశాల హెచ్‌ఎం షబ్బీర్, సొసైటీ సభ్యులు పఠాన్ రహమతుల్లా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన ఉండాలి

కోవూరు(విడవలూరు) : ప్రజలు హెచ్‌ఐవీ పట్ల అవగాహన కలిగి ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నిర్వాహకుడు శివకుమార్ తెలిపారు. మండలంలోని రామతీర్థం గ్రామ సచివాలయంలో మంగళవారం ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ బాధితులపై టీబీ వ్యాధి ప్రభావం ఉంటుందన్నారు. అందువల్ల ఆయా వ్యాధుల వారు జాగ్రత్తతో వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది భూషణం, సురేఖ, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఇందుకూరుపేట : అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరాలని ఐటీడీఏ పీఓ డాక్టర్ రాణి అన్నారు. మండల కేంద్రంలోని ఇందుకూరుపేట గ్రామ సచివాలయాన్ని ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. సచివాలయానికి వచ్చిన స్థానికులతో సిబ్బంది సేవలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. తొలుత స్థానిక గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాల సమీపాన ఉన్న గిరిజన కాలనీలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పిల్లలను నూరు శాతం బడిబాట పట్టించే కార్యక్రమం చేపడుతామని పీఓ పేర్కొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల ప్రతిభ

వెంకటాచలం: కర్ణాటకలోని శివమొగ్గలో జరిగిన జాతీయ సమైక్యత శిబిరంలో ప్రతిభ చూపిన వీఎస్‌యూ విద్యార్థులను వీసీ జీఎం సుందరవల్లి అభినందించారు. ఆ శిబిరానికి ఎంపికైన విద్యార్థులు తమ ప్రదర్శనలు, సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రతిభ చూపి మంగళవారం కాకుటూరులోని వర్సిటీకి వచ్చారు. ఈ సందర్భంగా వీసీ వారితో మాట్లాడి అభినందించారు. రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ ఉదయ్‌శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా జగనన్న సురక్ష

- కమిషనర్ వికాస్ మర్మత్
- సచివాలయాల్లో తనిఖీలు


మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): జగనన్న సురక్ష పథకాన్ని పారదర్శకంగా చేపట్టి.. అందరికీ చేరువయ్యేలా సచివాలయ సెక్రటరీలు కృషి చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ కోరారు. నగరంలోని 14 / 1, 2 బాలాజీనగర్, ఏసీనగర్ వార్డు సచివాలయాలను మంగళవారం తనిఖీ చేశారు. సచివాలయాల్లోని ఇన్‌స్పెక్షన్ రిజిస్టర్, నోటీస్ బోర్డు, హాజరు, స్పందన రిజిస్టర్లతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న సేవలను గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. ఎస్డీజీ, భూ హక్కు సర్వేలు, ఏపీ సేవా పోర్టల్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. స్పందన, జగనన్నకు చెబుదాం ఫిర్యాదులు, నాడు – నేడు పనుల పురోగతి, ఆస్తి పన్ను, యూజర్ చార్జీల వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. జగనన్న కాలనీల్లో నిర్మాణ పనులను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం డివిజన్‌కు సంబంధించిన అందిన స్పందన ఫిర్యాదులను టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఫిర్యాదులపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి సమస్యలు పునరావృతం కాకుండా చూడాలని చెప్పారు.

ఫ్యాప్టో సదస్సు జయప్రదానికి పిలుపు


మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(మినీబైపాస్): ఫ్యాప్టో ఆధ్వర్యంలో జూలై రెండున నిర్వహించనున్న సదస్సును విజయవంతం చేయాలని చైర్మన్ సురేంద్రరెడ్డి, సెక్రటరీ చిట్టేటి రమేష్ కోరారు. ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మంగళవారం వారు మాట్లాడారు. టౌన్‌హాల్లో ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్న సదస్సుకు తరలిరావాలని కోరారు.
హమీద్, మురళీకృష్ణ, శేషులు, ఏడుకొండలు, మధుసూదన్‌రావు, హజరత్, చలపతి, తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు తగ్గించాలని వినతి


ఎమ్మెల్యే అనిల్‌కు వినతిపత్రమిస్తున్న వామపక్ష నేతలు

నెల్లూరు (వేదాయపాళెం): పెంచిన కరెంట్ బిల్లులను తగ్గించాలని వామపక్ష నేతలు కోరారు. ఈ మేరకు నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌కు వినతిపత్రాన్ని నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మంగళవారం అందజేశారు. సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు దామా అంకయ్య, మూలం రమేష్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు, సీపీఐ నేతలు సిరాజ్, షానవాజ్, లక్ష్మీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యువ న్యాయవాదులకు అండగా ప్రభుత్వం



నెల్లూరు(లీగల్): యువ న్యాయవాదులకు అండగా నిలిచేందుకే వైఎస్సార్ లా నేస్తం ద్వారా ఆర్థిక సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ లా నేస్తం ద్వారా అర్హులైన జూనియర్ న్యాయవాదులకు రూ.25 వేలు జమైన నేపథ్యంలో పార్టీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో సంబరాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు బార్ అసోసియేషన్లో న్యాయవాదులకు మిఠాయిలను అందజేశారు. పార్టీ లీగల్ సెల్ న్యాయవాదులు వేలూరు రంగారావు, సలీమ్, రేఖారాణి, నరసయ్య, పెంచల ప్రణీత్‌కుమార్, సునీత, లత, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల ప్రచారం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలంటూ ఆ పార్టీ నేతలు నగరంలో ప్రచారాన్ని మంగళవారం నిర్వహించారు. మనుమసిద్ధినగర్, తదితర ప్రాంతాల్లో ప్రచారం చేశారు. నేతలు డాక్టర్ యశోధర, ఖాదర్‌బాషా, రేవతి, బాను, షాహినా, యాస్మిన్, తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి సింహవాహన సేవ



నెల్లూరు రూరల్: కనుపర్తిపాడులోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సింహవాహనంపై స్వామివారి గ్రామోత్సవాన్ని కనులపండువగా మంగళవారం నిర్వహించారు. ఉభయకర్తలుగా యంత్రపల్లి శేషయ్య, రమణమ్మ.. చేవూరు మధుసూదన్‌రెడ్డి, విమల.. సానా ఓబుల్‌రెడ్డి, సంపూర్ణమ్మ.. మర్రి వెంకటసుబ్బయ్య, కామాక్షి.. నరసయ్య, ఆదిరావమ్మ దంపతులు, తదితరులు వ్యవహరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వెండోటి చంద్రశేఖర్ రెడ్డి పర్యవేక్షించారు.

ఈద్గా అభివృద్ధి పనుల పరిశీలన



నెల్లూరు(బృందావనం): బారాషహీద్ దర్గా ప్రాంగణంలోని ఈద్గా వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మాళెం సుధీర్ కుమార్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు పనులను పరిశీలించామని వారు తెలిపారు.

మినిమమ్ టైమ్ స్కేల్‌ను వర్తింపజేయరూ..



నెల్లూరు (టౌన్): రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు మినిమమ్ టైమ్ స్కేల్‌ను ఇవ్వాలని వీఎస్‌యూ కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకటసుబ్బారెడ్డి కోరారు. ఈ మేరకు ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రాన్ని మంగళవారం అందజేశారు. కాగా ప్రభుత్వ పెద్దలతో త్వరలో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు.

బీజేపీలో పలువురికి పదవులు


నియామక పత్రాన్ని అందజేస్తున్న నేతలు

నెల్లూరు(మినీబైపాస్): బీజేపీ ఓబీసీ మోర్చా విశ్వకర్మ యోజన సెల్ జిల్లా కన్వీనర్‌గా ఆర్కాట్ కుమార్, కో కన్వీనర్‌గా ఉదయగిరి నిరంజన్, జిల్లా సభ్యుడిగా పాలూరు చంద్ర నియమితులయ్యారు. వీరికి నియామక పత్రాలను మంగళవారం అందజేసి సత్కరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గుండ్లపల్లి భరత్‌కుమార్, మోర్చా జిల్లా అధ్యక్షుడు యాకసిరి ఫణిరాజు, నేతలు మారం కృష్ణ, లోకేష్, మదన్, సాయి, శశి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి అభినందన



నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి అభినందించారు. వీఎస్‌యూలో డాక్టరేట్‌ను మంత్రి అందుకున్న నేపథ్యంలో అభినందనలను తెలియజేశారు.

యువగళం రూరల్ ఇన్‌చార్జిగా కోటంరెడ్డి

నెల్లూరు సిటీ: టీడీపీ నేత నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర రూరల్ ఇన్‌చార్జిగా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి బాధ్యతలను అప్పగిస్తున్నామని మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మాగుంట లేఅవుట్లోని బీద రవిచంద్ర నివాసంలో టీడీపీ నేతల ఆత్మీయ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జి జనార్దన్‌రెడ్డి, మాజీ మంత్రులు నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం


వెంకటసక్కుబాయి (ఫైల్)

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రంగనాయకులపేటకు చెందిన వెంకట సక్కుబాయి (71) సోమవారం మృతి చెందారు. ఈ క్రమంలో కుటుంబసభ్యుల అంగీకారంతో ఆమె నేత్రాలను జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జిల్లా ప్రభుత్వాస్పత్రి నేత్రదాన మోటివేటర్ బాలాజీసింగ్, ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ లాలేష్ సేకరించారు. అనంతరం నేత్రదాన సర్టిఫికెట్‌ను అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99481 64781, 93471 11033 నంబర్లను సంప్రదించాలని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ శర్వాణి కోరారు.

పాటలు, నృత్య పోటీలు రేపు



నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నామని ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేతా సుబ్బారావు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను పురమందిర ప్రాంగణంలో మంగళవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఉదయం పది నుంచి సాయంత్రం ఆరు వరకు పాటలు, డ్యాన్స్ పోటీలను నిర్వహించనున్నామని చెప్పారు. 75 మంది చిన్నారులు నృత్య ప్రదర్శనను నిర్వహించనున్నారని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనాలనుకునే వారు 77299 42543 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. రఘురామిరెడ్డి, మహేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రంగడి సన్నిధిలో తొలి ఏకాదశి రేపు

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో తొలి ఏకాదశి, పెరియాళ్వార్ వర్ష తిరునక్షత్ర వేడుకలను గురువారం నిర్వహించనున్నామని ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంగనాథుడికి తిరుమంజనం, బంగారు గరుడ సేవ, పెరియాళ్వార్లకు గజవాహన సేవను నిర్వహించనున్నామని చెప్పారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక


పార్టీలో చేరిన వారితో అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని 47వ డివిజన్‌కు చెందిన పిచ్చయ్య ఆచారి, మురుగ, వారి మిత్ర బృందం దాదాపు 150 మంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో మంగళవారం చేరారు. నగరంలోని కుక్కలగుంట లో నిర్వహించిన కార్యక్రమంలో నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి కండువాలు కప్పి ఆహ్వానించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానాన్ని కల్పిస్తామని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని కోరారు. బ్రహ్మయ్య, పుత్తూరు సిద్దయ్య, ఖాజన వీరబ్రహ్మ ఆచారి, పనబాక రవి, చిలకపాటి రమణయ్య, తదితరులు పార్టీ లో చేరారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణ ఆచారి పాల్గొన్నారు.

మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి



నెల్లూరు (వేదాయపాళెం): మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పందిటి సుబ్బయ్య కోరారు. దర్గామిట్టలోని అంబేడ్కర్ భవన్‌లో విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. జిల్లాలో మాదిగలకు తగిన రాజకీయ ప్రాధాన్యం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సేవా సమితి అధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడారు. రాజకీయ ప్రాధాన్యం లభించేంత వరకు మాదిగలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. మన ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు పల్లాల శ్రీనివాసులు, సునీత, సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ నేతలు కన్యకేశ్వరరావు, మందా రవి, కామేష్, కాకులూరి శ్రీనివాసులు, బద్దెపూడి వెంకట్రావు, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

హోటల్ రంగాన్ని ఆదుకోవాలి


మాట్లాడుతున్న అమరావతి కృష్ణారెడ్డి

నెల్లూరు(బృందావనం): ఎందరికో జీవనోపాధిని కల్పిస్తున్న హోటల్ రంగానికి రాయితీలను ప్రకటించి ఆదుకోవాలని హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి కోరారు. ఇస్కాన్ సిటీలోని హోటల్ మన్మంత్రలో మంగళవారం నిర్వహించిన జిల్లా హోటల్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని హోటళ్ల యజమానుల ఫుడ్ రేట్లు, స్ట్రీట్ ఫుడ్, ఆన్‌లైన్ సర్వీసులతో కలుగుతున్న నష్టాలు, తదితర అంశాలపై చర్చించారు. మురళీకృష్ణ గ్రూప్ ఆఫ్ హోటల్స్ చైర్మన్ గ్రోసు సుబ్బారావు, హోటల్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రాము, కోశాధికారి భీమేశ్వరరెడ్డి, సంయుక్త కార్యదర్శులు కుమార్‌రెడ్డి, కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాల చెరువు.. పరిశుభ్రం


గుర్రపుడెక్కను తొలగిస్తున్న కార్మికులు


శుభ్రం చేసిన తర్వాత..

నెల్లూరులోని స్వర్ణాల చెరువును శుభ్రం చేస్తున్నారు. రొట్టెల పండగ సమీపిస్తున్న నేపథ్యంలో గుర్రపుడెక్క, పిచ్చిమొక్కల తొలగింపు పనులను నగరపాలక సంస్థకు చెందిన కార్మికులు చేపట్టారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

క్రైమ్ కార్నర్

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): మద్యం తాగొద్దన్నారనే మనస్తాపంతో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల సమాచారం మేరకు... సుందరయ్యకాలనీలోని మార్యానగర్‌లో నివాసం ఉంటున్న రాజేష్ (35), మనీషా దంపతులకు ఇద్దరు కుమార్తెలు. టైల్స్ పనులు చేసుకొని కుటుంబాన్ని పోషిస్తున్న రాజేష్ మద్యానికి బానిసయ్యారు. సంపాదించిన మొత్తాన్ని మద్యానికే తగలేస్తూ కుటుంబపోషణను గాలికొదిలారు. ఫలితంగా కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. మద్యం తాగొద్దని పలుమార్లు భార్య కోరినా పెడచెవిన పెట్టడంతో వీరి మధ్య మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. పెద్దలు సర్దిచెప్పడంతో కొద్ది రోజుల పాటు తాగడాన్ని మాని ఇటీవల మళ్లీ ప్రారంభించారు. ఈ విషయమై రాజేష్‌ను భార్య సోమవారం నిలదీశారు. దీంతో వీరి మధ్య గొడవ జరిగింది. రాజేష్‌ను తన తల్లి పద్మ మందలించడంతో కొద్దిసేపు మిన్నకుండిపోయారు. మంగళవారం తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో భార్యతో రాజేష్ గొడవకు దిగారు. దీంతో పక్కింట్లో ఉంటున్న మహిళ మనీషాను తనతో పాటు బయటకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో రాజేష్ తన బెడ్ రూమ్‌లోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఉదయం నిద్ర లేచిన మనీషా తన అత్తతో కలిసి ఇంటికెళ్లి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ రాజేష్ కనిపించారు. స్థానికుల సాయంతో కిందికి దించి చూడగా అప్పటికే ఆయన మృతి చెంది ఉన్నారు. ఈ మేరకు వేదాయపాళెం పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించిన పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆత్మహత్యయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): ఆత్మహత్యయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. రాపూరుకు చెందిన రమణయ్య (38)కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మనస్పర్థల నేపథ్యంలో భార్య, పిల్లలను పదేళ్ల క్రితం వదిలేసి నెల్లూరులోని తెలుగుగంగ కార్యాలయ సమీపంలో ఆయన ఒంటరిగా నివాసముంటున్నారు. భర్తతో విడిపోయి ఒంటరిగా ఉంటున్న ఓ మహిళతో ఆయనకు పరిచయమై సహజీవనం చేయసాగారు. మనస్పర్థల కారణంగా ఈ నెల 21న ఆమె తన కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లారు. అదే రోజు రాత్రి రాపూరులోని తన కుటుంబసభ్యుల వద్దకు వెళ్లిన రమణయ్య మరుసటి రోజు నెల్లూరొచ్చారు. స్నేహితురాలు అలిగి వెళ్లిపోయిందనే మనస్తాపంతో ఈ నెల 23న తెలుగుగంగ కార్యాలయ సమీపంలోని టీ అంగడి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికుడు పెంచలయ్య జరిగిన విషయాన్ని రమణయ్య స్నేహితురాలికి తెలియజేశారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న ఆమె రమణయ్యను చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు, అక్కడి నుంచి నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. వైద్యుల సూచన మేరకు తిరుపతిలోని రుయా ఆస్పత్రికి ఈ నెల 25న తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రమణయ్య మృతి చెందాడు. ఈ మేరకు వేదాయపాళెం పోలీసులకు మృతుడి సోదరుడు నరేష్ ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.